క్లుప్తంగా

ధ్యాన శిబిరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

మానకొండూర్‌రూరల్‌: మండలంలోని పచ్చునూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో శుక్రవారం హార్ట్‌ఫుల్‌నెస్ ఇనిస్టిట్యూట్, శ్రీరామచంద్రమిషన్ సంస్థ ఆధ్వర్యంలో ధ్యాన శిబిరం నిర్వహించారు. ఆసనాలు, ప్రాణాయం, ముద్రలు, ధ్యానంతో బీపీ, మధుమేహం, ఒత్తిడి, ఊబకాయం, థైరాయిడ్ తదితర సమస్యలు పరిష్కారమవుతాయని నిర్వాహకులు తెలిపారు.

ఆరుష్ కిడ్స్ జోన్ ప్రారంభం



ప్రారంభోత్సవంలో ఆంజనేయులు, రాజేశ్వర్‌రావు

జమ్మికుంట: మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంటకు చెందిన, జార్ఖండ్ రాష్ట్రం పలమా జిల్లా కలెక్టర్ దొడ్డె ఆంజనేయులు, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావుతో కలిసి పట్టణంలోని ఆరుష్ కిడ్స్ జోన్‌ను శుక్రవారం ప్రారంభించారు. సొంత గ్రామంలో ఇటీవల పునర్నిర్మాణం చేపట్టిన శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, గ్రామస్తులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మద్ది లావణ్యసంపత్, పొనగంటి రాము తదితరులు పాల్గొన్నారు.

ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ



ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న యాదగిరి

గన్నేరువరం: మండలంలోని గునుకులకొండాపూర్ గ్రామంలో ఈజీఎస్ కూలీలకు శుక్రవారం ఫీల్డ్ అసిస్టెంట్ హన్మండ్ల యాదగిరి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. గురువారం ఎంపీడీవో స్వాతి పనులను పరిశీలించి కూలీలకు ఎండ నుంచి రక్షణ కోసం ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందించాలని సూచించటంతో పంపిణీ చేశామని యాదగిరి తెలిపారు.

డైరెక్టర్ల ఎన్నిక



ఎన్నికైన సంఘం డైరెక్టర్లు

మానకొండూర్‌రూరల్‌: మండలంలోని వేగురుపల్లిలో శుక్రవారం ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఇట్టవేణి వీరయ్య, ఆసరి రమేశ్, ఆసరి రాజు, గొడుగు మధు, జంగం మధుకర్, ఒడుసుల లక్ష్మి, జంగం లక్ష్మి సంఘం డైరెక్టర్లుగా గెలుపొందారు. శనివారం అధ్యక్ష్య, కార్యదర్శులను ఎన్నుకోనున్నారు.

బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

గన్నేరువరం: మండలంలోని మైలారం గ్రామ మైసమ్మ గుట్ట నుంచి లోయర్ మానేరు డ్యాం కట్ట వరకు బ్రిడ్జి నిర్మించాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బామండ్ల రవీందర్ కోరారు. మైసమ్మ గుట్ట లోయర్ మానేరు డ్యాంను సందర్శించారు. మంత్రి గంగుల కమలాకర్, ఎంపీ బండి సంజయ్‌కుమార్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు చొరవ తీసుకోవాలని కోరారు. మండల సరిహద్దు నుంచి రెండు కిలోమీటర్ల దూరంలోని కరీంనగర్‌కు వెళ్లాలంటే 40 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందన్నారు. మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కిలోమీటరున్నర బ్రిడ్జి నిర్మిస్తే గన్నేరువరంతో పాటు సిద్దిపేట, రాజన్నసిరిసిల్లా జిల్లాలోని బెజ్జంకి, ఇల్లంతకుంట మండల ప్రజలు ఎంతో అనువుగా ఉంటుందన్నారు. కరీంనగర్‌కు వెళ్లే విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉంటుందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచించాలని కోరారు.

బెంబేలెత్తిస్తున్న కుక్కలు

- గుంపులు గుంపులుగా తిరుగుతున్న శునకాలు
- గేదెలు, గొర్రెల మందలపై దాడులు
- ప్రాణాలు కోల్పోతున్న చిన్నారులు
- సంతతి పెరగకుండా నివారణ చర్యలు చేపట్టాలని ప్రజల డిమాండ్



చెంజర్లలో కుక్కల గుంపు (ఇన్‌సెట్లో) కుక్కల దాడిలో గాయపడిన గాజుల లక్ష్మి, శంకరపట్నం మండలం

మానకొండూర్: ఏదైనా పని ఉండి పలాన వ్యక్తి ఇంటికి వెళ్తామని చెబితే అటువైపు వెళ్లకుబిడ్డా ఆ ఇంటివద్ద ఉన్న కుక్క కరుస్తది అని హెచ్చరిస్తూ ఉండేవారు. ఎక్కడెక్కడ కుక్కలు ఉంటాయో మన పెద్దలు పిల్లలకు చెప్పేటోళ్లు. అలాంటిది ఇప్పుడు అక్కడా ఇక్కడా అన్నదేమి లేకుండా గల్లీ, వీధుల్లో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. మనుషులు, పశువులపై దాడి చేస్తున్నాయి. కుక్కల దాడిలో ప్రాణాలు కోల్పోతున్న ఘటనలతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. గతంలో కంటే కుక్క కాటు కేసులు భారీగా పెరిగాయని, ఆసుపత్రికి ప్రతిరోజు కుక్క కాటు కేసులు చాలా వస్తున్నాయని వైద్యులు తెలుపుతున్నారు.

ప్రతివీధిలో సంచారం

గ్రామాల్లో వీధి కుక్కల సంతతి పెరగడంతో ప్రజలు ఆందోళకు గురవుతున్నారు. ఒక్కప్పుడు గ్రామంలో ఏదో ఒక్క వీధిలో ఉండేవి ఇప్పుడు ప్రతి వీధిలో సమూహంగా సంచరిస్తున్నాయి. గతంలో కంటే రెట్టింపు స్థాయిలో వాటి సంతతి పెరిగిందని గ్రామస్తులు వాపోతున్నారు. అదే స్థాయిలో మనుషులపై, పశువులపై దాడులు చేస్తూ గాయపరుస్తుడటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కుక్కల దాడులు అధికంగా వస్తున్నాయని మండల సభల్లో వైద్యాధికారులు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి వాటి నివారణకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే మున్సిపాలిటీ ప్రాంతాల్లో కుక్కల సంతతి పెరగకుండా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తుండగా, గ్రామాల్లో సైతం ఆపరేషన్లు చేపట్టాలని కోరుతున్నారు. అధికారులు మాత్రం వాటి బారిన పడకుండా ఉండటమే శ్రీరామరక్ష అంటున్నారు.

కుక్కల సంఖ్య పెరగడంతోనే...

- గ్రామాల్లో వీధి కుక్కల సంతతి పెరిగింది. వాటి సంఖ్య ఎక్కువగా ఉండగా చిన్నారులు ఒక్కరు అటువైపుగా వెళ్తున్నప్పుడు చిన్నారులపై దాడులకు పాల్పడుతున్నాయి.
- గ్రామాల్లో చికెన్ సెంటర్ ఉన్న ప్రాంతాల్లో మాత్రం వీధి కుక్కలు విపరీతంగా ఉంటున్నాయి. ఆ ప్రాంతంలో రాత్రి వేళ వెళ్లాలంటే జంకుతున్నారు.
- వీధి కుక్కలు ఎక్కువ సంఖ్యలో ఉన్నప్పుడు మాత్రమే మనుషులు, మూగజీవాలపై దాడులకు పాల్పడుతున్నాయి.

ఇటీవల జరిగిన పలు ఘటనలు

- మానకొండూర్ మండలం పోచంపల్లి గ్రామానికి చెందిన కోమల్ల మహేశ్వరి (12) ఏడో తరగతి విద్యార్థిని తమ్ముడితో ఆడుకుంటూ ఉండగా కుక్క కాటుకు గురైంది. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం అందించినా మృతి చెందిన ఘటన అందరిని కలిచివేసింది.
- గన్నేరువరం మండలంలోని ఖాసీంపేట గ్రామంలో జేరిపోతుల ఎల్లయ్య, బడుగుల చొక్కయ్య, గుడికందుల అనిల్‌కు చెందిన లేగదూడలపై వీధి కుక్కలు దాడి చేయడంతో మృతువాత పడ్డాయి.
- శంకరపట్నం మండలం ఏరడపల్లికి చెందిన గాజుల లక్ష్మి, రాములు గురువారం వీధులు శుభ్రం చేస్తుండగా వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి.
- తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్‌లో పశువులపై కుక్కలు దాడి చేసి గాయపర్చాయి.



హుజూరాబాద్‌రూరల్: చెల్పూర్ జీపీ పరిధి తోకలపల్లి గ్రామంలో శిలువ యాత్ర

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

చొప్పదండి, హుజూరాబాద్ నియోజకవర్గాల్లో శుక్రవారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే నిర్వహించారు. సర్వ మానవాళి పాప విమోచనానికి క్రీస్తు శిలువనెక్కారని పలువురు పేర్కొన్నారు.శిలువ యాత్ర నిర్వహించారు. క్రీస్తు పడిన శ్రమలు వీధుల్లో ప్రదర్శించారు. ప్రముఖ చర్చిల్లో ప్రార్థనలు చేశారు. ప్రతి ఒక్కరూ ఇతరుల పట్ల ప్రేమ, జాలి, దయ కలిగి ఏసుక్రీస్తు అడుగుజాడల్లో నడవాలని కోరారు. పాస్టర్లు ఉపదేశం అందించారు. ప్రార్థనలు, గీతాలు ఆకట్టుకున్నాయి.

– సాక్షి నెట్‌వర్క్



చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని పెద్దపాపయ్యపల్లి, ధర్మరాజుపల్లి గ్రామాల్లోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శుక్రవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, ఎంపీపీ రాణిసురేందర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కొండల్‌రెడ్డి, సర్పంచులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

మానకొండూర్: మండలంలోని కొండపల్కల గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బండి సంపత్, ఉపాధ్యక్షుడు గట్టు రమేశ్, డైరెక్టర్లు బండి పెద్ద కొంరయ్య, గట్టు రాజయ్య, బండి సంపత్, ఎరవేని రవి, కొలిపాక రామయల్లు, గట్టు రాయమల్లు శుక్రవారం బీఆర్‌ఎస్‌లో చేశారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, సర్పంచ్ నల్ల వంశీధర్‌రెడ్డి, కడారి ప్రభాకర్, అడప శ్రీనివాస్, బొల్లం శ్రీనివాస్, ఉప సర్పంచ్ తోట రాజమౌళి, వార్డు మెంబర్లు తిరుపతి, సుదాకర్, నల్లగొండ తిరుపతి, రేణుక పాల్గొన్నారు.

నిరుద్యోగులతో చెలగాటమాడొద్దు



కాగడాల ప్రదర్శనలో వైఎస్సార్‌టీపీ నాయకులు

చొప్పదండి: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ నాయకుడు తడగొండ సత్యరాజ్‌వర్మ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో శుక్రవారం రాత్రి పార్టీ పట్టణ అధ్యక్షుడు గుర్రం మధు ఆధ్వర్యంలో టీసేవ్ కార్యక్రమంలో భాగంగా కాగడాల ప్రదర్శన నిర్వహించామన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీ పిలుపు మేరకు కార్యక్రమం చేపట్టామని తెలిపారు. అధినేత వైఎస్ షర్మిల పిలుపు మేరకు రోజూ నిరసన కార్యక్రమాలు చేపడుతామని చెప్పారు. కార్యక్రమంలో జగిత్యాల జిల్లా మహిళా అధ్యక్షురాలు గాదె స్రవంతి, నాయకులు మేక అంజయ్య, దాసరి రవి శాస్త్రి, కుక్కల పెద్ద లచ్చవ్వ, మోదుంపల్లి శ్రీకాంత్, ముత్యాల శ్రీనివాస్ రెడ్డి, గుమ్మడి త్రివర్ణ, పెంచాల వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న మామిడి అంజయ్య, నాయకులు

చిగురుమామిడి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చిగురుమామిడి మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మామిడి అంజయ్య కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో 17 గ్రామశాఖల అధ్యక్షులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అంతర్గత విభేదాలను పక్కనబెట్టాలన్నారు. ఈ సమావేశంలో మండల రైతు సమన్వయసమితి కో ఆర్డినేటర్ పి తిరుపతి, మండల ప్రచార కార్యదర్శి బి రాంబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి కె రాజేశ్వర్‌రెడ్డి, ఆయా గ్రామశాఖల అధ్యక్షులు ఏ శివప్రసాద్, కె రమేశ్, ఏ జనార్ధన్‌రెడ్డి, సిరాజ్‌పాషా, కె కొమురయ్య, టి శ్రీనివాస్, ఆర్ వెంకటయ్య, పి వేణు, ఎస్ సంపత్ రెడ్డి పాల్గొన్నారు.

పూలే జయంతి ఉత్సవ కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి, తదితరులు

హుజూరాబాద్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద 11న నిర్వహించనున్న జ్యోతిరావుపూలే జయంతి ఉత్సవ కరపత్రాన్ని శుక్రవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ ఆవిష్కరించారు. కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ... సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు, సంఘసేవకుడు జ్యోతిరావుపూలేను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బుర్ర కుమార్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, నాయకులు తాళ్లపల్లి శ్రీనివాస్, కల్లెపల్లి రమాదేవి, తాల్లపల్లి రమేష్, అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఎర్ర శ్రీధర్, బాబూ జగ్జీవన్‌రామ్ కమిటీ అధ్యక్షుడు ఇల్లందుల సమ్మయ్య, శ్రీనివాస్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల జయంతికి తరలిరావాలి



మాట్లాడుతున్న జేరిపోతుల మహేందర్

గన్నేరువరం: మండల కేంద్రంలో ఈ నెల 11, 14 వ తేదీల్లో నిర్వహించే జ్యోతిరావుపూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమాలను విజయవంతం చేయాలని అంబేడ్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు జెరిపోతుల మహేందర్ అన్నారు. గన్నేరువరంలో శుక్రవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మహనీయులు, బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతుల జయంతికి ప్రజాప్రతినిధులు, మేధావులు, ఉద్యోగులు, విద్యార్థులు, కర్షకులు, సబ్బండ వర్గాల ప్రజలు పాల్గొనాలని కోరారు. సమావేశంలో బీజేపీ జిల్లా నాయకులు కల్లెపల్లి భూమయ్య, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు మీసాల ప్రభాకర్, అంబేడ్కర్ సంఘం నాయకులు రామంచ సంపత్, వేదిర విజేందర్, కవ్వంపల్లి మునీందర్, దమ్మగల్ల అనిల్, బీఎస్పీ సెక్టార్ అధ్యక్షుడు రేపాక బాబు, జాడిగపు రమేష్, రామంచ అనంద్ పాల్గొన్నారు.

ఇంటింటికీ సీపీఐ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో శుక్రవారం ఇంటింటికీ సీపీఐ పోస్టర్‌ను మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఈ నెల14 నుంచి మే 14 వరకు అన్ని గ్రామాల్లో సీపీఐ పర్యటిస్తుందని, అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బాదుల్లా , సాగర్, వెంకటస్వామి, రవి, శ్రీధర్, హరీశ్, అంజయ్య తదితరులు ఉన్నారు.

రోడ్డుపై ధాన్యం ఆరబోస్తే కేసులు



రైతులతో మాట్లాడుతున్న ఎస్సై చంద్రశేఖర్

శంకరపట్నం: రోడ్లపై వరి ధాన్యం ఆరబోస్తే కేసులు నమోదు చేస్తామని కేశవపట్నం ఎస్సై చంద్రశేఖర్ హెచ్చరించారు. మండలంలోని మెట్‌పల్లి గ్రామంలో శుక్రవారం రైతులతో మాట్లాడారు. రోడ్డుపై ధాన్యం పోస్తే ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్డు మీది ధాన్యం కల్లాలకు తరలించాలని ఆదేశించారు. మండల వ్యాప్తంగా రైతులు రోడ్డుపై ధాన్యం పోయొద్దని సూచించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కులు పంపిణీ చేస్తున్న వినోద, కొత్త తిరుపతిరెడ్డి

తిమ్మాపూర్: మండలంలోని ఇందిరానగర్‌కు చెందిన రొడ్డలతకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును శుక్రవారం సర్పంచ్ కాటిక వినోద, ఎంపీటీసీ కొత్తతిరుపతిరెడ్డి ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈసందర్భంగా కుటుంబ సభ్యులు సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమేష్, గ్రామశాఖ అధ్యక్షుడు రాంకిషన్, దామకుమార్, మాజీ ఉపసర్పంచ్ కవ్వంపెల్లి అంజి, వార్డుసభ్యులు శ్రీనివాస్, దొంత శంకర్, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

రామడుగు: మండలంలోని షానగర్ ఎంపీటీసీ భర్త కొత్త వెంకటేశ్ ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ వెంకటేశ్‌ను పరామర్శించారు.

జమ్మికుంటలో పాడి..

జమ్మికుంట: జమ్మికుంట పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు టంగుటూరి రాజ్‌కుమార్ తల్లి రజియా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వీణవంకకు చెందిన యుప్‌టీవీ అధినేత పాడి ఉదయనంద్‌రెడ్డి శుక్రవారం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలు తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలోని అంబేడ్కర్ చౌక్‌లో స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలవేసి నివాళి అర్పించారు. అనంతరం స్థానిక కౌన్సిలర్ శ్రీపతి నరేష్ ఉదయనంద్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు ఏబూసి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు ముద్రగడ నవీన్, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకులు ఆవుల తిరుపతి, శ్రీరామ్, వీణవంక మాజీ సర్పంచ్ చిన్నాల ఐలయ్య, మాజీ జెడ్పీటీసీదాసరి ప్రభాకర్, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

వైభవంగా రాములోరి రథోత్సవం



గట్టుభూత్కూర్ రథోత్సవంలో భక్తులు

గంగాధర: మండలంలోని గట్టుభూత్కూర్ గ్రామంలో శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా చివరి రోజు రథోత్సవం వైభవంగా నిర్వహించారు. తొమ్మిది రోజులు రాములోరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం సర్పంచ్ కంకణాల విజయేందర్‌రెడ్డి సమర్పించిన పట్టువస్త్రాలతో స్వామివారిని అలంకరించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రథోత్సవంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కంకణాల రాజగోపాల్‌రెడ్డి, పాలక వర్గం సభ్యులు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీనరసింహస్వామి..



గన్నేరువరం: మండల కేంద్రంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రథోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. రథాన్ని ఆలయం చుట్టూ తిప్పిన అనంతరం భక్తులు దర్శించుకున్నారు. భక్తులు రథాన్ని తాడుతో లాగుతూ గ్రామంలోని వీధుల్లో తిప్పారు. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. సమీప గ్రామాల ప్రజలు సైతం స్వామి భారీగా తరలివచ్చారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

బిజిగిరిషరీఫ్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

జమ్మికుంట: మండలంలోని బిజిగిరిషరీఫ్ దర్గాలో రంజాన్ సందర్భంగా హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ చైర్మన్ మహమ్మద్ సలీం పాషా ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ ఆయురారోగ్యాలతో ఉండాలని శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అధికార పార్టీ నాయకులు బల్మూరిపై రాజకీయ కుట్రలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ మాజీ అధ్యక్షుడు కసుబోజుల వెంకన్న, నాయకులు చిన్నింటి నాగేంద్ర, పందిళ్ల శంకర్, ఎర్రబెల్లి తిరుపతిరావు, మైనారిటీ నాయకులు మహమ్మద్ అజ్మత్, మహమ్మద్ అలీ షరీఫ్, హాకీం తదితరులు పాల్గొన్నారు.